# ఎర్రచీమ

- ఎ.జి.మణి



అరుపులు, కేకలు, అల్లర్లు ఆ ప్రాంతాన్ని హోరెత్తిస్తున్నాయి. గొంతు చించుకొని మాట్లాడినా ఎవ్వరికీ వినపడనంత రణగొణ ధ్వని. కానీ అక్కడ జరుగుతున్నది - తమ సమస్యల పరిష్కారానికి జనం చేస్తున్న సమ్మె కాదు... ఆకలి కేకలతో అల్లాడుతున్న బిచ్చగాళ్ళ అరుపు లసలే కాదు. అది కేవలం ఓ ఎలిమెంటరీ స్కూల్లోని అయిదో తరగతి గదిలో పిల్లలు చేస్తున్న అల్లరి !

ఆ పాఠశాలను దూరం నుంచి చూస్తే శిథిలాలయంలా, కొంచెం దగ్గరగా వెళ్తే పాడువడిన సత్రంలా, ఇంకొంచెం దగ్గరగా వచ్చి చూస్తే ప్రభుత్వ కార్యాలయంలా కనిపిస్తుంది. బోర్డు కూడా లేని ఆ భవనంలోని తరగతి గదిలో పిల్లల్ని చూస్తేనే కానీ అదొక బడి అని ఎవరూ నమ్మరు.

ఆ అయిదో తరగతి గదిలో ఓ మూలగా కూర్చొని ఉన్నాడు ఓంకార్. పదేళ్ళ ఓంకార్ మెతకవాడు. అల్లరి చేస్తున్న మిగతా అబ్బాయిల్ని బిక్కుబిక్కు మంటూ చూస్తున్నాడు. తెలుగు మాస్టారు వెళ్ళి అయిదు నిమిషాలే కావస్తోంది. తరువాత క్లాసు లెక్కల మాస్టారిది. ఆయన నిన్ననే ఆ పాఠశాలకు కొత్తగా బదిలీ అయి వచ్చాడు. మహా చండశాసనుడు. వచ్చి ఒక్క రోజే కావస్తున్నా స్కూల్లో పిల్ల లందరూ గడగడ వణికేలా చేసుకున్నాడు. తను వాళ్ళకు గురువే అయినా, అతని దృష్టిలో ఎవరికైనా దెబ్బే గురువు - అన్న నానుడిని జీర్ణించుకున్నవాడు.

ఆ రోజే ఓంకార్ తరగతి వాళ్ళకు మొదటి రోజు క్లాసు తీసుకోబోతున్నా డాయన. క్లాసు దగ్గరవుతున్న కొద్దీ గదిలో పిల్లలు చేస్తున్న అల్లరి ఎక్కువవుతోంది. ఆయన ముఖంలో కోపం, ఆగ్రహం తాలూకు భావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయ్. ఆ రో జెలాగైనా వాళ్ళకు నా తడాఖా ఏమిటో చూపించాలి - అని పిడికిలి బిగించి ఒక్కసారిగా క్లాసులో అడుగు పెట్టాడు.

ఉన్నట్టుండి ఒక్కసారిగా ఆ గదిలో చీమ చిటుక్కుమంటే వినబడేంత నిశ్శబ్దం ఏర్పడింది.

ఎలాగైనా ఒకడ్ని పట్టుకు తన్నా లనుకున్న లెక్కల మాస్టారు ఆశ నిరాశే అయ్యింది. కానీ, ఎలాగైనా వీళ్ళలో ఒకడికి రెండు తగిలిస్తే మిగతా వాళ్ళు తనంటే ఒణికి చస్తారు !

ఉన్నట్టుండి ఆయన దృష్టి ఓంకార్ మీద పడింది. బుద్ధిగా చూస్తున్నాడు - కొత్త మాస్టార్ని ! ఓంకార్ దగ్గరగా వెళ్ళి ఉరుముతూ అడిగాడు-

"ఏమిటి? క్లాసులో ఒకటే గొడవ చేస్తున్నావ్...?" హుంకరిస్తూ అడిగాడు.

మాస్టారు ఏకంగా తన్నే అడగడంతో ఏ తప్పూ చెయ్యని ఓంకార్ బిర్రబిగుసుకుపోయాడు !

"ఏరా రాస్కెల్... అడుగుతేంది నిన్ను కాదూ" అంటూ ఓంకార్ కాలర్ పుచ్చుకుని పైకి లేవనెత్తాడు. ఓంకార్ నుంచి సమాధానం రాకపోవడంతో శివమెత్తిపోయా డాయన.

అంతే... మరుక్షణం ఓంకార్ దవడలు వాచిపోయాయ్... కళ్ళు బైర్లు కమ్మాయ్. ఒళ్ళు హూనం అయిపోయింది.

మిగతా పిల్ల లందరూ కిక్కురుమనకుండా కళ్ళప్పగించి చూస్తుండిపోయారు. మాస్టారు విజయగర్వంతో వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. అటెండెన్స్ వేసి చెప్పాడు-

"చూశారా, అల్లరి చేసిన వాడికేం గతి పట్టిందో? ఇకమీ దెవరైనా అలా చేస్తే మీకూ వాడికి పట్టిన గతే పడుతుంది."

క్లాసయినంతసేపూ ఓంకార్ వెక్కుతూనే ఉన్నాడు. క్లాసయిం తరువాత లెక్కల మాస్టారు వెళ్తూనే ఓంకార్ కూడా ఇంటికి వెళ్ళిపోయాడు. అయిదు నిమిషాల తరువాత తన తండ్రితో బాటు లెక్కల మాస్టారు ఎదురుగా ఉన్నాడు ! ఓంకార్ తండ్రిని చూస్తూనే మొహం చిట్లిస్తూ చెప్పా డాయన-

"ఇదొకటి నేర్చుకున్నారండి మీ తల్లిదండ్రులు పిల్లల్ని కాస్త దండించగానే స్కూల్లో మాస్టార్ల మీద పడ్డం."

"ఇంతకీ మా అబ్బా యేం చేశాడండీ?" ఓంకార్ తండ్రి గొంతులో బాధ స్పష్టంగా వినిపిస్తోంది.

"ఏం చెయ్యడమేంటి? క్లాసులో టాపెగిరిపోయేట్టు అరుస్తున్నాడు. చెవులు చిల్లులు పడిపోయాయి." బొంకా డాయన.

"నిజంగా మా వా డరుస్తుండగా మీరు చూశారా?" మళ్ళీ ప్రశ్నించాడు ఓంకార్ తండ్రి.

"నా కళ్ళారా చూశాను. చెవులారా విన్నాను."

"చూసుండరు... విని ఉండరు !"

"ఏం? ఎందుకని?" రెట్టించా డాయన.

"మావాడు పుట్టినప్పట్నుంచి మూగవాడు కాబట్టి..."

ఆ జవాబుకు లెక్కల మాస్టారు మూగబోయాడు ★

# నేను చదివిన పుస్తకం

## దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు?

ప్రముఖ కవి, హేతువాది, అభ్యుదయ రచయిత అయిన కీ.శే. తాపీ ధర్మారావుగారు సుమారు పదిహేను సంవత్సరాలు విషయాన్వేషణ చేసి, 'దేవాలయాల మీద బూతు బొమ్మ లెందుకు?' అనే పుస్తకం రాసినట్లు పుస్తక ప్రారంభంలో 'విన్నపం'లో పేర్కొన్నారు. పదిహేను సంవత్సరాలు కాదు, నిజానికి తన జీవితాంతం కృషి చేసినా ఇంత మంచి పుస్తకం మరో రచయిత రాయలే దనడం నిర్వివా దాంశం. ఇది పుస్తకంగా వెలువడక ముందే, 'ప్రజామిత్ర' పత్రికలో ప్రతి వారం వ్యాసాలుగా వెలువడి ఆంధ్రుల అపారమైన ఆదరణకు నోచుకున్నది.

పుస్తక ప్రారంభంలోనే 'కోవెల' అంటే ఏమిటో ధర్మారావుగారు చక్కగా వివరించారు. కోవెల అని పలకడం సమజసం కాదని నిజానికి కోయిల అని ఉచ్చరించాలని కోయిలకు వికృత రూపమే 'కోవెల' అని విశదీకరించారు. అరవ భాషలో గుడికి 'కోయిల్' అంటారు. 'కో' అంటే దేవుడు. 'ఇల్' అంటే ఇల్లు. దీనిని బట్టి కోయిల్ అంటే దేవుడి ఇల్లు అని అర్థం. దీన్ని సంస్కృతంలో 'దేవాలయం' అన్నారు. ఈ పుస్తకంలో పలుచోట్ల రచయిత మన తెలుగు నిఘంటు కర్తలను ఆధారాలతో సహా చక్కగా విమర్శించారు.

సంగమించడమే సత్కర్మ. మంకు లాంటి మనిషికైనా మన్మథావేశం కలిగించడం, చేతగాని వాడినైనా సిద్ధహస్తుణ్ణి చేయడం దేవాలయాల మీద బూతు బొమ్మల ప్రధానోద్దేశ మని ధర్మారావుగారు వివరించారు.

పూర్వకాలంలో మన దేవాలయాలు సంభోగాల కోసం, బూతు పనుల కోసం నిర్మించిన వేనని, నిజానికి దేవాలయాలు శోభనపు గదులని చక్కగా అభివర్ణించారు. పెళ్ళి కూడా చేసుకోకుండా జీవిత కాల మంతా దేవాలయంలోనే ఈ బూతు పనులతో దైవారాధన చెయ్యాలని నిశ్చయించుకున్న స్త్రీలు కూడా ఉండేవారని, వారు తమ జీవిత కాలా న్నంతా భగవత్ సేవ కోసం సమర్పించి తమ వృత్తిలో ఆర్జించిన ధనాన్ని దేవాలయాలకే దానం చేసేవారని స్పష్టం చేశారు.

రవికల పండగ గురించి రచయిత చక్కగా వివరించారు. ఈ పండగ నాడు ఆడవాళ్ళందరూ కోవెలలోకి వస్తారు. పూజా పునస్కారాల అనంతరం ఆడవాళ్ళందరూ తాము తొడుక్కున్న రవికలు తీసి ఒకచోట పోగుగా పడేస్తారు. తరువాత మగవాళ్ళు ప్రవేశించి తలా ఒక్కొక్క రవికను తీసి పట్టుకుంటారు. ఇలా పురుషుడు ఏ స్త్రీ రవికను తీసుకుంటాడో ఆ స్త్రీ ఆ రాత్రంతా ఆ పురుషునితో గడపాలి. ఇదీ రవికల పండగ. ఈ పండగ సంవత్సరానికి కొక పర్యాయం జరుగుతుంది. ఈ పండగ మన దక్షిణ ప్రాంతంలో కూడా ఉన్నట్లు రచయిత పేర్కొన్నారు.

ఇలా ధర్మారావుగారు ఈ పుస్తకంలో లింగ పూజ, ఆరాధన, మంగళసూత్రాలు-వాటి ఆకారాలు, రతి విలాస పానీయాలు, సనాతన సంకర ధర్మాలు, మగవాళ్ళ పడుపు వృత్తి మొదలైన విషయాలను ఆసక్తికరంగా వివరిస్తూ [ఈ పుస్తకం మూలాన అనేక విమర్శ లొస్తాయని తెలిసి కూడా] తెలుగువారి కందించిన వారి ధైర్యానికి వారే సాటి.

- బగ్గాం మన్మథరావు

---

బాలయ్య: టైలరింగ్ వృత్తికీ, జేబు దొంగతనానికీ చాలా సామ్యా లున్నాయ్. నీకు తెలుసా?

రాజు: ఏమిటవి?

బాలయ్య: రెంటికీ కత్తిరింపులో నేర్పు కావాలి. కాళ్ళలో సత్తువ ఉండాలి.

శిరం వెంకటరామకృష్ణ